

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ

**తాకత్ వతన్ కీ హం సే హై**

**హిమ్మత్ వతన్ కీ హం సే హై**

**ఇజ్జత్ వతన్ కీ హం సే హై**

**ఇన్సాన్ కే హం రఖ్వాలే.**

మహమ్మద్ రఫీ, మన్నాడేలు కలసి, అంటే నిజంగానే కలసి పాడిన ఈ పాట 'ప్రేమ్ పూజారి' సినిమాలోది. ఈ పాటలో మహమ్మద్ రఫీ స్వరం కానీ, మన్నాడే స్వరంకానీ విడివిడిగా ప్రత్యేకంగా వినబడవు. ఇదొక సామూహిక బృందగానం. అందరూ కలసి పాడుతూంటారు. అందరితో కలసి మనకు రఫీ, మన్నాడేల గొంతులు ప్రత్యేకంగా వినిపిస్తూంటాయి. ఈ పాటకు సంగీతం కూర్చింది ఎస్డీబర్మన్. పాటను రచించింది నీరజ్‌గా ప్రసిద్ధి పొందిన గోపాల్ దాస్ నీరజ్ శ్రీవాస్తవ.

'ప్రేమ్ పూజారి' ఒక విలక్షణమైన సినిమా. దేవ్ ఆనంద్ స్వయంగా నిర్మించిన ఈ సినిమాకు దర్శకుడు కూడా దేవానంద్. దేవ్ ఆనంద్ దర్శకత్వం వహించిన తొలి చిత్రం ఇది. నిజానికి, దేవానంద్ నిర్మించిన సినిమాలు ఆ కాలంలో వచ్చిన ఇతర సినిమాలతో పోలిస్తే సమయం కన్నా ముందున్న సినిమాలు.

'ప్రేమ్ పూజారి' సినిమా ఓ సున్నిత మనస్కుడి మానసిక సంఘర్షణను ప్రతిబింబిస్తుంది. హీరో దేవ్ ఆనంద్ హింసకు వ్యతిరేకి. తన గ్రామంలో హీరోయిన్ వెంటబడి తిరుగుతూ , సీతాకోకచిలుకలు పట్టుకుంటూ పాటలు పాడుతూ రొమాన్స్ చేస్తూంటాడు. అయితే అతని తండ్రి మిలటరీవాడు. అతని బలవంతం మీద సైన్యంలో చేరతాడు. వారి పద్ధతులు నచ్చవు. హింసకు సిద్ధంగా ఉండటం నచ్చదు. మిలటరీ వదలి పారిపోతాడు. కానీ దేశానికి వ్యతిరేకంగా జరుగుతున్న విదేశీ కుట్రలను గమనించి, క్షమార్పణలు చెప్పుకుని మళ్లీ మిలటరీ గూఢచారిగా చేరతాడు. దేశరక్షణలో పాలు

పంచుకుంటాడు. ఇదీ టూకీగా 'ప్రేమ్ పూజారి' సినిమా కథ. హింసను వ్యతిరేకించిన వ్యక్తి, తప్పనిసరి పరిస్థితులలో హింస కూడా తప్పనిసరి అని అర్ధం చేసుకోవటం సినిమా కథ.

సాధారణంగా కొందరు మేధావులు 'మిలటరీ వాళ్లేమీ దేశభక్తులు కాదు, వారు కూడా జీతగాళ్లలాంటివారే, జీతం కోసం పని చేసే వాళ్లే' అని వాదిస్తారు. మరికొందరు మిలటరీ వాళ్లు రక్తపిపాసులు, రేపిస్టులు అన్నట్టు మాట్లాడతారు. ' అని వాదిస్తారు. మిలటరీ వాళ్లు అవసరం లేదన్నట్టు ప్రవర్తిస్తారు. ఇలాంటి వారందరికీ సమాధానం లాంటిది 'ప్రేమ్ పూజారి' సినిమా. ఈ సినిమా హీరో సున్నిత మనస్కుడు. హింస అంటే పడదు. సైన్యం అంటే నచ్చదు. ప్రధమార్ధం అంతా సైనిక వ్యతిరేకత ప్రదర్శిస్తాడు. ద్వితీయార్ధంలో సైన్యం ఆవశ్యకతను, వారి త్యాగాన్ని గుర్తిస్తాడు. దేశ రక్షణ బాధ్యతను నిర్వహిస్తాడు. ఈ సందర్భంలో వస్తుంది 'తాకత్ వతన్ కీ హం సె హై' పాట.

కొడుకు సైన్యం నుండి పారిపోవాలని ప్రయత్నిస్తూంటాడు. అదే సమయానికి పూర్వ  సైన్యాధికారుల సమావేశం జరుగుతూంటుంది. ఆ సమావేశంలో అందరూ కలసి పాడుతూంటారు. ఈ దేశానికి బలం మేమే. దేశ ఆత్మ ధైర్యం మేమే. దేశగౌరవం మేమే. ప్రజల సంరక్షకులం మేమే అంటు. నీరజ్ ఈ పాటను ఎంతో గొప్పగా రాశాడు. చక్కని పదాలు వాడేడు. సైన్యం తత్వాన్ని , లక్ష్యాన్నీ, మనస్తత్వాన్ని అత్యద్భుతంగా ప్రకటించాడు.

**పహరేదార్ హిమాలయ్‌కే హం,**

**ఝోకే హై తుఫాన్ కే**

**సున్‌కర్ గరజ్ హమారీ సీనే ఫట్ జాయ్ చట్టాన్ కే...**

హిమాలయాలకు కాపలాదారులం మేము. తుఫాను గాలులం. మా గర్జన వింటే పర్వతాల హృదయాలు కూడా పగిలిపోతాయి. అలాంటి శక్తులం మేము అంటున్నారు సైనికులు. సైనికులు ఎలాంటి దాడినయినా ఎదుర్కొనేందుకు నిత్యం సంసిద్ధంగా ఉంటారు. ప్రాణాలు త్యాగం చేసి అయినా దేశాన్ని కాపాడేందుకు సిద్ధంగా ఉంటారు. వారి శక్తిని, దీక్షను  చక్కని పదాలతో ప్రదర్శించాడు కవి నీరజ్.

**సీనా హై ఫౌలాద్ కె అప్నా, ఫూలోం జైసా దిల్ హై**

**తన్ మే వింధ్యా చల్ కా బల్ హై, మన్ మే తాజ్ మహల్ హై.**

అద్భుతమైన చరణం ఇది.

వారి ఛాతీ లోహం లాంటిది. కానీ హృదయం పూవు  వంటిది. శరీరంలో వింధ్యాచలం బలం ఉంటుంది. మనస్సుల్లో తాజ్ మహళ్లుంటాయి. అద్భుతం  అనిపిస్తుంది. సైనికులు హింసకు సిద్ధంగా ఉంటారు. శత్రు సైనికులను చంపుతారు. వాళ్లు జీతగాళ్లు అంటూ వ్యాఖ్యానించే వాళ్ళందరూ అర్థం చేసుకుని అనుభవించాల్సిన భావం ఇది. శరీరంలో వింధ్యాచలం బలం, మనస్సులో తాజ్‌మహల్. తాజ్‌మహల్‌ను ప్రేమకు ప్రతీకగా భావిస్తారు. ఒక సున్నితమైన భావన ఇది. తాజ్‌మహల్ గురించి ఎవరెవరు ఎలాంటి వ్యాఖ్యలు చేసినా, నిజంగా తాజ్‌మహల్ ముందుకెళ్లి నుంచుంటే నోటమాట రాదు. సైనికులూ మనుషులేననీ, శత్రువు పట్ల కాఠిన్యం ప్రదర్శించినా వారి హృదయాలు నవనీతం వంటివనీ చెప్తోంది ఈ చరణం.

**దేకర్ అప్ నా ఖూన్  సీంచ్‌తే దేశ్ మె హమ్ ఫుల్ వారీ**

**బన్సీ సే బందూక్ బనాతే హమ్ వో ప్రేం పూజారీ..**

సైనికుల గురించి ఎవరికైనా అపోహలు, దురూహలుంటే వాటిని పటాపంచలు చేస్తుందీ చరణం. సైనికులు కూడా మామూలు మనుషులే. కానీ దేశ రక్షణ కర్తవ్య దీక్ష కల వారు. ప్రజల కోసం సర్వం త్యాగం చేసేందుకు సిద్ధంగా ఉంటారు. ఇతర ఏ ఉద్యోగంలోనైనా 'ఇది నా పని కాదు' అనే వీలుంటుంది. సైన్యంలో అలాంటి ఆలోచన కూడా రాదు. ప్రతి కార్యక్రమంలో క్షణం ఆలోచించకుండా ముందుకు దూకుతారు. అందుకే తమ రక్తంతో దేశంలో పూలతోటలు విరగబూయిస్తామంటున్నారు సైనికులు. సరిహద్దుల కాపలా మాత్రమే కాదు, దేశంలో కూడా ఎప్పుడు ఎలాంటి అవసరం వచ్చినా ముందుండేది సైనికులే. వరదలు వస్తే రక్షణలో ముందుండేది సైనికులే. వంతెనలు కూలిపోతే అత్యవసరంగా వాటిని పునర్నిర్మించేది సైనికులే. భూస్ఖలనాలు, తుఫానులు...ఒకటేమిటి, ఎలాంటి విపత్తు సంభవించినా రక్షణకోసం ఆలోచించకుండా ముందుకు దూకేది సైనికులే. వారిని జీతగాళ్ళుగా భావించటం మూర్ఖత్వం.

బన్సీ అంటే వేణువు. శాంతి సమయంలో  ఎంత సౌమ్యంగా ఉంటారో, అవసరం వచ్చినప్పుడు అంత శక్తిని ప్రదర్శిస్తారు. బన్సీని బందూకుగా మారుస్తారు. వేణువును తుపాకీలా మార్చేంతటి ప్రేమ పూజారులు వాళ్లు. అంటే, ప్రేమకు బదులు ప్రేమ. శత్రుత్వం ప్రదర్శిస్తే శత్రువులు అన్నమాట. కానీ ప్రేమ మౌలిక భావన. శత్రువుతో యుద్ధం చేసే సమయంలో కూడా ఎలాంటి ద్వేష భావన వుండదు. వున్నది తన దేశాన్ని రక్షించే బాధ్యత, కర్తవ్య నిర్వహణ భావన మాత్రమే.

**ఆకర్ హంకో కసం దేగయీ, రాఖీ కిసీ బహన్ కీ**

**దేంగే అప్నీ శీష్, నదేంగే మిట్టీ మగర్ వతన్‌కీ**

'అబ్బ' అనిపిస్తుంది ఈ చరణం చదవగానే. తమ తలను ఇచ్చేందుకు సిద్ధం కానీ ఈ భూమి ఒక్క అడుగు కూడా ఇచ్చేందుకు సిద్ధంగా లేము అంటున్నారు సైనికులు. వారు అక్కడ అడ్డుగా నిలబడకపోతే వారిలో 'ప్రాణాలిస్తాము కాని శత్రువును ఒక్క అడుగుకూడా ముందుకు వేయనీయము' అన్న పట్టుదల లేకపోతే, దేశ ప్రజలు శాంతంగా, ప్రశాంతంగా, భద్రంగా ఉండలేరు. అందుకే 'సోదరి కట్టిన రాఖీ సాక్షిగా' అన్నాడు కవి. అది వారి కర్తవ్యం, బాధ్యత, దీక్ష అనుకోవటం వల్ల సైనికులు ప్రాణాలు సైతం లెక్క చేయకుండా రక్షణకు నిల్చున్నారు. జీతం కోసం కాదు. జీతం కోసమే సైనికులు ప్రాణాలిచ్చేందుకు సిద్ధంగా ఉంటారని వాదించే వారికి మానవ మనస్తత్వం , విలువల గురించి తెలియదు.

**ఖత్రే మే దేశ్ హోతో అరే లడ్ నా హీ సిర్ఫ్ తేరా ధరంహై**

**మర్ నా హై క్యా చీజ్ ఆద్ మీ లేగా నయా జనం హై.**

సినిమాలో హీరో సందేహానికి సమాధానం ఇక్కడ లభిస్తుంది. దేశం ప్రమాదంలో ఉన్నప్పుడు శాంతి శాంతి అంటూ కూర్చుంటే లాభం లేదు. హింసకు వెరచి వెనకడుగు వేస్తే ఉపయోగం ఉండదు. హీరోకు హింస అంటే పడదు. అందుకే సైన్యం అంటే ఇష్టం ఉండదు. కానీ శత్రువు మీదకు వస్తూంటే 'అహింస' అని కూర్చుంటే వచ్చిన వాడు అన్నీ దోచుకుని, తల నరికిపోతాడు. అందుకే ముందు చరణంలో సోదరి కట్టిన రాఖీ వారికి కర్తవ్యం గుర్తు చేసింది. వాగ్దానం గుర్తుచేసింది. యుద్ధాలలో అందరికన్నా ఎక్కువ కష్టపడేది స్త్రీలు, పిల్లలే. అందుకే దేశం ప్రమాదంలో పడ్డప్పుడు పోరాడటమే ధర్మం. మహాత్మాగాంధీ కూడా దేశ విభజన సమయంలో ఇదే చెప్తాడు. పోరాడుతూ మరణించమన్నాడు. అది అసలు శాంతి కాముకుల ధర్మం. అనవసరమైన హింసకు దూరంగా ఉండాలి. తప్పనిసరి పరిస్థితులలో పోరాటం తప్పదు. అది ధర్మం. భగవద్గీత అలాంటి హింసను 'సాత్త్విక హింస' అంటుంది. అలాంటి వాళ్లు మరణించరు. నూతన జన్మ ఎత్తుతారు.

**ఏక్ జాన్ ఏక్ ప్రాణ్ హై సారా దేశ్ హమారా**

**నదియా చల్ కర్ థకీ రుకీ పర్ కభీ న గంగా ధరా**

## తాకత్ వతన్ కీ హం సె హై

దేశమంతా ఒక్కటి. నదులు ప్రవహించి అలసి ఆగిపోతాయేమో కానీ గంగానదికి ఆగటం అంటూ ఉండదు. దేశం కోసం సైనికులు అలాగే అలుపు సొలుపు లేకుండా అవిశ్రాంతంగా నిరంతరం రక్షణలో ఉంటారు. కర్తవ్యాన్ని నిర్వహిస్తారు. దేశానికి శక్తి మేమే అంటున్నారు సైనికులు. అలాంటి సైనికులపై అనవసర ఆరోపణలు చేస్తూ, వారి ఆత్మ విశ్వాసాన్ని దెబ్బ తీస్తూ, వారిని చులకన చేయటం ఏ దేశానికీ, దేశ ప్రజలకూ క్షేమకరం కాదు. తమకు రక్షణనిచ్చే కొమ్మను నరికివేయటం అవుతుంది అది.

ఈ నిజం గ్రహించిన హీరో సైనికుల పట్ల ఉన్న అపోహలు తొలగిపోగా తానూ దేశం కోసం సర్వం త్యాగం చేసేందుకు సిద్ధ పడతాడు. తమ రక్షకులను గౌరవించలేనివారికి వారి రక్షణ పొందే అర్హత లేదంటారు. భారతీయులు ఈ నిజాన్ని గ్రహించాల్సిన అవసరం గతంలో కన్నా ఇప్పుడు ఎంతో అవసరం. స్వలాభాలు కోరి ప్రజల నడుమ, భాషాభేదాలు, ప్రాంతీయ భేదాలు, కులమత భేదాలు ఇలా ఎన్ని రకాలుగా ద్వేషభావనలు పెంచవచ్చో అన్ని రకాలుగా ప్రయత్నాలు జరుగుతున్నప్పుడు ప్రజలు నిజానిజాలు గ్రహించి, జాగరూకులై 'ఏక్ జాన్ హై ఏక్ ప్రాణ్ హై సారా దేశ్ హమారా' అన్న భావనలకు బలం ఇవ్వాల్సి ఉంటుంది. సైనికులు సరిహద్దులు కాపాడతారు. ప్రజలు దేశాన్ని అంతర్గతంగా శక్తిమంతం చేయాల్సివుంటుంది. అప్పుడే బాహ్య శత్రువులు, అంతర్గత శత్రువులనుంచి దేశం సురక్షితంగా వుంటుంది. సైనికులు సరిహద్దులవద్ద ఎంత అప్రమత్తంగా వున్నా, అంతర్గతంగా అల్లకల్లోలమవుతూంటే, ఆ దేశ పరిస్థితి కరిమింగిన వెలగపండే అవుతుంది.

దేఖో  యే ధర్తీ హం సబ్‌కీ మాతా హై

సోచో  ఆపస్ మే క్యా ఆప్ నా నాతా హై

హం ఆపస్ మే లడ్ బైఠేతో దేశ్ కో కౌన్ సంభాలేగా?

కోయీ బాహర్ వాలా ఆప్ నే ఘర్ సే హమే నికాలేగా

దీవానో హోష్ కరో!

మెరే దేశ్ ప్రేమియో ఆపస్ మే ప్రేమ్ కరో దేశ్ ప్రేమియో!

ఇది ఈ నాటి ఆవశ్యకత. స్త్రీ పురుష ప్రేమ దైవత్వం అయితే దేశ ప్రేమ ధర్మం. భారతదేశంలో ధర్మానికే పెద్దపీట. కాబట్టి ఇలాంటి అత్యద్భుతమైన పాటలని వింటూ వాటి భావాన్ని అర్ధం చేసుకుంటూ, దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించేందుకు సిద్ధంగా ఉన్నవారి ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించటం ప్రతి పౌరుడి కర్తవ్యం అని గ్రహించాలి. అసలైన ప్రేమ పుజారి ఆత్మగౌరవం, ఆత్మ విశ్వాసంతో ధర్మం కోసం సర్వం త్యాగం చేసేవాడని గ్రహించాలి. నీరజ్ రాసిన ఈ పాట ఈ విషయాన్ని ఎంతో గొప్పగా ప్రదర్శిస్తుంది.

(వచ్చే నెల మరిన్ని పాటలతో)

**comments**